بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 19.05.2017 (TELUGU)**

**మనము మన జీవితములను శాంతియుతంగా మార్చుకోదలచినచో, అల్లాహ్ తఆలా శుభములను పొందగోరిచనో మన యజమాని, విధేయతార్హులైన హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి సమస్యలో మన ముందుంచిన, అనంతరం ఈ కాములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడు వాటిని స్పష్టముగా మనకు తెలిపి, వాటిని ఆచరించాలని సూచించిన సత్ప్రవక్తనలను మనము మన జీవిత భాగములుగా చేసుకోవలసిన అవసరమున్నది**

*హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 19.05.2017 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, మార్డన్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పై అవతరించిన బోధన మనకు ప్రతి సమస్యలో మార్గదర్శనము చేయును. మనలోని ప్రతి ఒక్కరు ఈ బోధనను ఆచరించినచో ఒక చక్కటి సమాజము ఏర్పడవచ్చును. పవిత్ర ఖుర్ఆన్‌లో అనేక ఆజ్ఞలు గలవు. కాని అల్లాహ్ ఆలా వాటన్నిటిని ఒక చోట ఒక వాక్యములో ఇట్లని సమకూర్చెను. لَقَدۡ کَانَ لَکُمۡ فِیۡ رَسُوۡلِ اللّٰہِ اُسۡوَۃٌ حَسَنَۃٌ (అల్ ముమ్తహినహ్:7) అనగా మీ కొరకు నిశ్చయముగా అల్లాహ్ ప్రవక్తలో ఒక మంచి ఉదాహరణ గలదు. కుటుంబము నుండి సమాజ సంబంధముల వరకు గల పవిత్ర ఖుర్ఆన్ సమస్త ఆదేశములను పాటించే విధముగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితము వ్యాపించి యుండెను. ప్రతి విషయములో ఈ ఉదాహరణను పాటించినప్పుడే స్వచ్ఛమైన విజయము లభించును. కొన్ని సార్లు మానవుడు పెద్ద పెద్ద విషయములలో మంచి ఉదాహరణలను చూపుచుండును. కాని బాహ్య రూపంలో చిన్నగా కనిపించే కొన్ని విషయములను అప్రధానమైనవిగా భావించుచు నిర్లక్ష్యము చేయును. మనము మన జీవితములను శాంతియుతంగా మార్చుకోదలచినచో, అల్లాహ్ తఆలా శుభములను పొందగోరినచో మన యజమాని, విధేయతార్హులైన హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి సమస్యలో మన ముందుంచిన, అనంతరం ఈ కాలములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడు వాటిని స్పష్టముగా మనకు తెలిపి, వాటిని ఆచరించాలని సూచించిన సత్ప్రవర్తనలను మనము మన జీవిత భాగములుగా చేసుకోవలసిన అవసరమున్నది.

హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా ఇట్లనిరి. పురుషుల వివిధ స్థాయిల వలన వారిపై గల బాధ్యతల గురించి నేనిప్పుడు కొన్ని విషయములు చెప్పదలచితిని. ఇంటి యజమానిగా కూడ పురుషుని బాధ్యత గలదు. ఒక తండ్రిగా కూడ పురుషుని బాధ్యత గలదు. కుమారునిగా కూడ పురుషుని బాధ్యత గలదు. ప్రతి పురుషుడు ఈ బాధ్యతలను అర్థము చేసుకొని వాటిని చెల్లించుటకు ప్రయత్నించినచో ఇదే సమాజము విస్తృత స్థాయిలో శాంతిని స్థాపించుటకు, సోదరభావమును స్థాపించుటకు కారణమగును. సంతాన సంస్కరణకు ఇవే కారణమై శాంతి, మానవ హక్కులను స్థాపించు సంతానము వ్యాపించుటకు కారణమగును. కుటుంబ సుఖః శాంతులు ఈ విషయముతోనే ఏర్పడును. తమ భార్య హక్కులు చెల్లించకుండా, ఆమెకు ధర్మబద్ధమైన హక్కు చెల్లించకుండా, సంతాన సంస్కరణ హక్కును చెల్లించకుండా భర్తలు కేవలం నామమాత్రపు యజమాన్యము చేయుచున్నారని నేడు చాలా గృహముల నుండి ఫిర్యాదులు కూడ అందుచున్నవి. భర్తలు భార్యలను కొట్టి కొట్టి శరీరముపై వాతలు పడేశారు లేదా గాయపరచారు లేదా ముఖము వాచినదను ఫిర్యాదులు భారత్ నుండి కూడ గలవు. పాకిస్తాన్ నుండి కూడ గలవు. హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను విశ్వసించిన తరువాత మూర్ఖుల వలె యుండదలచినచో తమ స్థితులను మార్చుకుంటామని ప్రతిజ్ఞ

చేసి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్‌లో రావడం నిష్ప్రయోజనమగును.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కుటుంబ యజమాని అయినందున మొట్ట మొదట దైవ ఏకత్వ స్థాపన ప్రాముఖ్యతను తన భార్యా పిల్లలకు స్పష్టము చేసి దానిని ఆచరింపజేశారు. కాని ఈ పనిని కూడ బలవంతముగా కాక ప్రేమానురాగముతో చేయించారు. తీరిక లేకున్నను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ కుటుంబ సభ్యుల హక్కులు చెల్లించారు. ప్రేమానురాగము, మృదుత్వము, ఆప్యాయతతో ఈ హక్కు చెల్లించారు. దైవ ఏకత్వ స్థాపన, అల్లాహ్ తఆలా ఆరాధనే మీ బాధ్యత. హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్‌హా ఇట్లు తెలిపారు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం రాత్రి నఫిల్ కొరకు నిద్రలేచేవారు. వేకువజామున నమాజ్ కంటే కొంచెం ముందు నఫిల్ చదవండి, ఆరాధించండి, అల్లాహ్ తఆలా హక్కు చెల్లించండని నీళ్ల చుక్కలు చల్లి మమ్ములను లేపేవారు.

వారు ఇంటి పనులు ఎలా చేసేవారో వివరించుచు హజ్రత్ ఆయిషా రజియల్లాహు తఆలా అన్‌హా ఇట్లు తెలిపారు. వారు తమ దుస్తులను తామే కుట్టుకునేవారు. బూట్లు కుట్టుకునేవారు. గృహోపకరణాలను మరమ్మతు చేసుకునేవారు. ఈ ఉదాహరణలు తమ ముందుంచుకొని భర్తలందరు తమ ఆత్మ పరిశీలన చేసుకోవలెను. ఒక సందర్భమున ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మంచి ప్రవర్తనలు గల వ్యక్తే విశ్వాసులలో సంపూర్ణ విశ్వాసము గల వ్యక్తి. తమ భార్యలతో సత్ప్రవర్తనతో వ్యవహరించే వ్యక్తియే మీలో మంచి సద్గుణములు గలవాడగును. విశ్వాస ప్రామాణిక ఉన్నతమునకు ఇదొక సంకేతమని తమ భార్యలతో మంచిగా వ్యవహరించని వ్యక్తి ఆత్మ పరిశీలన చేసుకోవలెను. భర్త బాధ్యతలు, భార్యలతో మంచిగా వ్యవహరించుట గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. స్త్రీల సిగ్గుమాలిన పనులు తప్ప మిగతా కఠినత్వములు, దుష్ప్రవర్తనలను భరించవలెను. పురుషుడై స్త్రీతో యుద్ధము చేయు విషయము అతి నీచమైనదిగా మేము భావించెదము.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. చిన్న చిన్న విషయముపై తమ భార్యలతో జగడమాడే, వారిని హింసించే వ్యక్తులు సిగ్గుపడవలెను. ఇవి చిన్నవిగా కనిపించినను చిన్నవి కావని నేనింతకు ముందే చెప్పాను. స్త్రీలో ఫలానా ఫలానా దుష్టత్వము యున్నందునే మేము కఠినముగా వ్యవహరించవలసి వచ్చునని కొందరు పురుషలు అంటారు. అటులైనచో తాము ధార్మిక ప్రామాణికమునకు చేరినారా అని పురుషులు మొదట తమ ఆత్మ పరిశీలన చేసుకోవలెను. ఇటువంటి పురుషులకు ఉపదేశము చేయుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. పురుషులు సత్యవంతులు కానిచో స్త్రీ ఎలా పుణ్యస్తురాలగును. స్త్రీకి మాటలతో గుణపాఠం చెప్పకూడదు. ఆమెకు ఆచరణతో ఉపదేశము చేసినచో ప్రభావము పడును. దేవునితో భయపడని వ్యక్తి స్త్రీని దేవునితో ఎలా భయపెట్టించగలడు. భర్త రాత్రికి నిద్రలేచి ప్రార్థనలు చేయుచు దుఃఖించుచున్నచో స్త్రీ ఒకటి రెండు రోజులు చూడును, తుదకు ఏదో ఒక రోజు ఆమెకు ఆలోచన కలిగి తప్పక ప్రభావితమగును. స్త్రీకి ప్రభావితమయ్యే అలవాటు ఎక్కువ గలదు. వారిని తీర్చిదిద్దుటకు భర్త ఆచరణీయ ఉదాహరణ కంటే ఎక్కువ ఏ పాఠవాల పనికిరాదు. నా భర్త ఫలానా పాపము చేస్తాడని వాదించే విధముగా తమ లోపములను పట్టుకొనుటకు స్త్రీలకు అవకాశమిచ్చుట పురుషుల తప్పిదము. స్త్రీ ఎంత కష్టపడి ప్రయత్నించినా ఆమెకు ఎటువంటి పాపము కనిపించనిచో ఆమెకు సన్మార్గ ఆలోచన కలిగి ఆమె మతమును అర్థము చేసుకొనును. హుజూర్ ఇట్లనిరి. అన్వేషించినా ఎలాంటి పాపము పురుషునిలో కనిపించనిచో స్త్రీ ధార్మికురాలు కాకున్నా ఆమెకు ధర్మము వైపు శ్రద్ధ కలుగును.

హుజూర్ ఇట్లనిరి. తమ బైఅత్ చేసిన పురుషులతో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు ఒక వైపు ఇటువంటి ఆశయములు గలవు. రెండవ వైపు అనేక పురుషుల గురించి స్త్రీలు ఇట్లు ఫిర్యాదులు చేయుచున్నట్లు మనము చూస్తున్నాము. నమాజులలో సోమరులుగా యున్నారు, సామూహిక నమాజ్ అటుంచితే ఇంట్లో కూడ నమాజ్ చదవరు. పురుషులకు ధార్మిక విద్య అతి తక్కువ యున్నది. చాలా మంది పురుషులు చందాలలో వెనుకబడియున్నారు. టి.వి.లో అనవసర, వృథా కార్యక్రమాలను తిలకిస్తారని పురుషుల గురించి ఫిర్యాదులు గలవు. పిల్లల పట్ల శ్రద్ధ వహించరని అనేక పురుషుల గురించి ఫిర్యాదు గలదు. ఇంటి యజమానిగా నిరూపించుటకొనుటకు కోప్పడడం, కొట్టడం తప్ప మరేమి చేయరు. పురుషులతో స్త్రీలు నేర్చుకునే బదులు చాలా

గృహములలో పురుషులకు స్త్రీలు నేర్పించుచున్నారు లేదా పిల్లలు చెడిపోకూడదని వారికి నేర్పించుచుందురు. పిల్లలు సంస్కరణకు దూరమగుటకు కారణం పురుషుల అశ్రద్ధయే లేదా భార్యా పిల్లలపై అనవసరంగా కఠినత్వము ప్రదర్శించడమే. మాతో లేదా మా తల్లితో మా తండ్రి వ్యవహారము మంచిగా లేదని చాలా మంది పిల్లలు నాకు ఫిర్యాదు చేస్తారు. గృహములను శాంతియుతంగా మార్చదలచినచో, భావి తరాలను చక్కదిద్ద దలచినచో వారిని ధర్మముతో జోడించదలచినచో పురుషులు తమ స్థితుల వైపు దృష్టి సారించవలసిన అవసరమున్నది. పురుషులకు శ్రద్ధ కలిగించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇంకను ఇట్లనిరి. పురుషుడు తమ కుటుంబమునకు నాయకుడు. అతడే దుష్ప్రభావము వేసినచో ఇంకెంతగా దుష్ప్రభావము పడునో ఆలోచించవచ్చును. పురుషుడు తమ శక్తులను సందర్భానుసారము, సముచితమైన సమయములో వినియోగించవలెను. ఉదా॥ ఒక శక్తి కోపము గలదు. కాని హద్దులు దాటినచో పిచ్చితనమునకు నాంది పలుకును. అతిగా కోపిగించుకునే వ్యక్తి నుండి వివేకము గుంజుకోబడును. వ్యతిరేకునితో కూడ కోపమునకు గురై సంభాషించకూడదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇది ప్రామాణికము. ఇంట్లో భార్యా, పిల్లలను కోపగించుకోకూడదు. వ్యతిరేకి అయినను అతనితో కూడ కోపమునకు గురై, వివేరహితముగా మాట్లాడకూడదు. నజారత్ ఇస్లాహ్ వ ఇర్షాద్, ఉపశాఖలు ఇటువైపు దృష్టి సారించవలెను. ప్రపంచవ్యాప్తముగా కూడ తమ సంస్కరణ కార్యక్రమాలను నిర్వహించుటకు అధిక శ్రద్ధ వహించవలెను. ప్రచారము చేయుచున్నారు, ధార్మిక సేవలు నేర్చుకుంటున్నారు. కాని గృహములో అశాంతి స్థితులు యున్నచో ప్రచారము ఎలాంటి లాభము కలిగించదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. కుటుంబములు విచ్ఛిన్నం కాక ముందు, పిల్లలు నాశనం కాక ముందు తమపై భార్యా పిల్లల గురించి ధర్మము మోపుచున్న తమ బాధ్యతలను, ఇస్లాం వారికి నిర్ణయించిన కర్తవ్యములను గుర్తించగలరు. స్త్రీల హక్కులు, వారితో వ్యవహరించవలసిన తీరు గురించి ఒక సందర్భమున హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. స్త్రీల హక్కులను ఇస్లాం రక్షించిన విధముగా మరే ధర్మము రక్షించలేదు. క్లుప్తమైన అక్షరములలో وَلَهُنَّ مِثْلُ الَّذِي عَلَيْهِنَّ అనగా స్త్రీలపై పురుషుల హక్కులు యున్నట్లే పురుషులపై స్త్రీల హక్కులు గలవని చెప్పెను.

ఇద్దరు నిజమైన, స్వచ్ఛమైన మిత్రులలో సంబంధము యున్నట్లే భార్యలతో భర్తలకు సంబంధము యుండవలెను. పురుషుని సత్ప్రవర్తనలు, అల్లాహ్ తఆలాతో సంబంధమునకు మొదటి సాక్షులు ఈ స్త్రీలే. వీరితో వారికి సత్సంబంధములు లేనిచో అల్లాహ్ తఆలాతో సంధి ఏర్పడడం ఎలా సాధ్యమగును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. పురుషులకు తండ్రిగా గల బాధ్యతను కూడ గ్రహించవలెను. పిల్లల సంస్కరణ బాధ్యత తల్లిదని మాత్రమే భావించకూడదు. నిస్సందేహముగా కొంత వయసు వచ్చే వరకు పిల్లల సమయం తల్లి వద్దనే గడుచును. అతి బాల్యములో తల్లుల శిక్షణ కీలక పాత్ర పోషించును. కాని దీని వలన పురుషులు తమ బాధ్యతలను విస్మరించరాదు. తండ్రులు కూడ పిల్లల శిక్షణలో తమ పాత్ర పోషించవలెను. ప్రత్యేకంగా కుమారులు 7, 8 సంవత్సరముల వయసుకు చేరినప్పుడు వారిపై తండ్రులు దృష్టి సారించవలసియుండును. లేనిచో ఈ పశ్చిమ వాతావరణములో పిల్లలు చెడిపోయే అవకాశము ఎక్కువ గలదు. పిల్లల ప్రవర్తనలు మంచిగా యుండుటకు తండ్రులు పిల్లలను గౌరవించవలసిన అవసరము యున్నట్లే వారు పరిసరాల దుష్ప్రభావములతో ప్రభావితం కాకుండా యుండుటకు పిల్లలపై గట్టి నిఘా వుంచడం కూడ ముఖ్యమే. పిల్లల శిక్షణ కొరకు ఆచరణీయ శ్రద్ధ వహించుచు వారి కొరకు దుఆలు చేయు వైపు కూడ దృష్టి సారించుట తండ్రుల కర్తవ్యము. ఇది కూడ ముఖ్యమే. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మార్గదర్శనము, నిజమైన శిక్షణ అందించుట అల్లాహ్ తఆలా పని. నిరంతరం నిఘా పెట్టుట, ఒకే పనిపై హద్దులు దాటి పట్టు బట్టుట మనమే మార్గదర్శనమునకు యజమానులమని మనము మన ఇష్టానుసారము అతన్ని ఒక మార్గముపై తీసుకొని రాగలమని భావించుచున్నట్లు సూచించును. ఇదొక రకమైన అన్యారాధనయే. మన జమాఅత్ దీని నుండి దూరముండవలెను. ఇంకను ఇట్లనిరి. మేము మా పిల్లల కొరకు దుఆ చేస్తాము. సూచనప్రాయంగా సూత్రములు, విద్యా ప్రమాణాలను పాటించుతాము. ఇంత కంటే ఎక్కువ కాదు. అనంతరం అల్లాహ్ తఆలానే పూర్తిగా నమ్మెదము. ఎవరిలో సత్కార్య బీజము యున్నదో వారు తగిన

సమయములో సశ్యశ్యామలమగుదురు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. సంతానము కొరకు కొంత ధనము వుంచాలని కొందరి ప్రజల అభిప్రాయము. ధనము వుంచాలనే ఆలోచన వారికి కలుగుచున్నది. కాని సంతానము దుష్కార్యులు కాకుండా సత్కార్యులు కావలెనని కలత లేనందుకు నాకు ఆశ్చర్యము కలుగుచున్నది. ఇందుకు ఎలాంటి ఆందోళన కలుగదు. అల్లాహ్ తఆలా స్వయముగా ఇట్లనెను. وَهُوَ يَتَوَلَّى الصّٰلِحِيْنَ (అల్ ఆరాఫ్:197) అతడు సజ్జనులకే సంరక్షకునిగా యుండును. దుష్టుడైనచో లక్షల రూ॥ అతని కొరకు విడిచినా పాపములలో నాశనం చేసి బిచ్చగాడగును. అతని కొరకు అనివార్యమైన ఇబ్బందులు, కష్టములలో పడిపోవును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. తమ పిల్లల శిక్షణ వైపు దృష్టి సారించుము, వారి కొరకు దుఆలు చేయుమని తండ్రికి ఇస్లాం ఆదేశమిచ్చినట్లే మీపై కూడ కొన్ని బాధ్యతలు గలవని ప్లిలలకు కూడ ఆదేశించును. మారు యవ్వన దశకు చేరినచో మీపై కూడ కొన్ని హక్కులు గలవు. వాటిని మీరు చెల్లించవలెను. బంధుత్వముల ఈ హక్కులను పరస్పరం జోడించినప్పుడే శాంతియుత సమాజము ఏర్పడును. తల్లిదండ్రుల హక్కు చెల్లించుట ఎంత పెద్ద బాధ్యతతో, దానికి ఎంత ప్రాముఖ్యత గలదో అను విషయము అందరికి తెలిసియుండవలెను. ఒక బాలుడు యవ్వనమునకు చేరుకున్నప్పుడు తల్లిదండ్రుల హక్కులు ఎలా చెల్లించాలి అని తెలుపుచు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నేను ధర్మ యుద్ధమునకు వెళ్ళదలచితినని ఒక వ్యక్తి ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో హాజరై వేడుకొనెను. నీ తల్లిదండ్రులు బ్రతికియున్నారా అని అతన్ని వారడిగిరి. అతడు అవునని అనెను. వారివురి సేవలు చేయుము. ఇదే నీ ధర్మయుద్ధమని బదులిచ్చిరి.

ఒక అనుచరుడు ఇట్లు తెలిపెను. మేము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో యుండగా బనీ సల్మాకు చెందిన ఒక వ్యక్తి వచ్చి ఇట్లు అడిగెను. ఓ అల్లాహ్ ప్రవక్త! తల్లిదండ్రులు మృతి చెందిన తరువాత వారి కొరకు నేను చేయగల పుణ్యము ఏదైనా యున్నదా. ఎందుకు లేదని వారనిరి. మీరు వారి కొరకు దుఆలు చేయగలరు. వారి కొరకు క్షమాపణ యాచించగలరు. ఇతరులతో వారు చేసిన వాగ్దానములను పూర్తి చేయగలరు. వారి బంధు మిత్రులతో వారు తమ జీవితములో యుండిన విధముగా వారితో కలిసి యుండగలరు, మంచిగా వ్యవహరించగలరు. వారి మిత్రులతో మర్యాదగా వ్యవహరించగలరు.

ఒక పురుషునిగా తమపై గల విభిన్న బాధ్యతలన్నిటిని చెల్లించుటకు ప్రయత్నించవలెను. ప్రేమానురాగ వాతావరణము ఎల్లప్పుడు నిలిచేలా తమ గృహములను ఆదర్శవంతముగా చేసుకోవలెను. ఒక పురుషుడు భర్తగా కూడ యుండును, తండ్రిగా కూడ యుండును. కుమారునిగా కూడ యుండును. కనుక ఈ విధముగా తమ బాధ్యతలను అర్థము చేసుకోవలెను. పురుషునికి ఇంకా అనేక స్థాయిలు గలవు. కాని కుటుంబ ప్రాథమిక ఐక్యత ఏర్పడుటకు ఈ మూడు స్థాయిలనే నేను వివరించాను. తద్వారా సమాజ శాంతికి ఇది ఆధారమగును. ఈ ప్రాథమిక స్థాయిలో శాంతి ఏర్పడినప్పుడు ఇందులో విస్తృత స్థాయిలో సౌందర్యము ఏర్పాటు చేయుటకు ప్రయత్నించవలెను. అల్లాహ్ తఆలా ఇందుకు మనందరిని అనుగ్రహించుగాక! (ఆమీన్). ☆ ☆ ☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Hafiz Syed Rasool Niyaz, Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

.......................................................................

.......................................................................

.......................................................................